సాక్షి
గుంటూరు
బుధవారం । 28 । మే । 2025



ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఫిరంగిపురం: రేపూడి మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను మంగళవారం ఆర్డీవో కె.శ్రీనివాసరావు పరిశీలించారు. తహసీల్దార్ జె.ప్రసాదరావు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 512.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పాలవాగు పూడిక తీత

రాయపూడి(తాడికొండ): రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రాయపూడి గ్రామంలోని పాలవాగు పూడికతీత పనులు ప్రారంభించారు.

న్యూస్‌రీల్

నేడూ పొగాకు రైతుల నిరసన

చిలకలూరిపేట: నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ చిలకలూరిపేటలోని ఐటీసీ కంపెనీ వద్ద పొగాకు రైతులు చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. ఈ మేరకు రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు తెలిపారు. క్వింటా ధర రూ.15వేలకు తక్కువ కాకుండా బర్లీ పొగాకును కంపెనీల చేత ప్రభుత్వం కొనిపించాలని కోరారు. దీక్షకు రైతులు, రైతు సంఘాల నాయకులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు కోటప్పకొండలో యోగాంధ్ర

నరసరావుపేట: కోటప్పకొండ శైవక్షేత్రం వద్ద యోగాంధ్ర కార్యక్రమం బుధవారం ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మంగళవారం సుదర్శన హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి మంగళాశాసనాలతో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటల నుంచి సర్వ రక్షాకర సుదర్శన హోమాన్ని నిర్వహించామని తెలిపారు. అమావాస్య రోజున హోమం, పారాయణం, శాంతులు, దానాలు చేయడం ఎంతో ఉన్నత ఫలితాలను ఇస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : బక్రీదు పండుగను పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి హెచ్చరించారు. జూన్ 7న జరిగే బక్రీదు పండుగ సందర్భంగా గేదెలు, ఇతర పశువులను అధిక సంఖ్యలో వాహనాల్లో తరలించి వధకు పాల్పడితే వారిపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేయడంతోపాటు, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. వాహనాల్లో పశువులను తరలించే వారు ఎంవీఐ యాక్ట్ 1989, రూల్ 253 ప్రకారం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలని, అనంతరం తరలించాలని సూచించారు.

శని జయంతి పూజలు



మంగళగిరి టౌన్: శ్రీశనైశ్చర స్వామి జయంతిని పురస్కరించుకుని మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలోని నవగ్రహ మండపంలో మంగళవారం శనిజయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి తైలాభిషేకం, అర్చనలు, జపాలు, పూజలు నిర్వహించి పురోహితులకు నువ్వులు దానాలు ఇచ్చారు. దేవస్థానంలోని మల్లేశ్వరునికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ తగు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

ఎంపీహెచ్ఏలకు బదిలీ



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లాలో వివిధ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ మేల్ కేడర్‌కు చెందిన 172 మందికి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించి మలేరియా, డెంగీ, చికున్ గున్యా ప్రబలి ఉన్న పలు ఆరోగ్య కేంద్రాలకు బదిలీ చేశారు. ఈ ప్రక్రియలో డీఎంహెచ్‌ఓతోపాటు, పరిపాలన అధికారి లక్ష్మీకుమారి, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు సత్యం, భక్తవత్సలం, సీనియర్ అసిస్టెంట్లు కిరణ్, రహీం పాల్గొన్నారు.

మళ్లీ కరోనా కలవరం

కరోనా పేరు చెబితేనే ప్రతి ఒక్కరి గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. మళ్లీ ఇటీవల దేశ వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కూడా మూడు కరోనా కేసులు వెలుగు చూడటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు



- అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు ఆదేశాలు
- ప్రజలు తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల సూచన
- వ్యాధి బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో నిర్ధారణ పరీక్షలు

గుంటూరు మెడికల్ కరోనా వ్యాప్తి చెందకుండా తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ కొవిడ్–19 నాటి నిబంధనలు పాటించేలా చూడాలని ఆదేశాల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వ్యాధి వ్యాప్తి పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ఉత్తమమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. నూతన కరోనా వైరస్ సైతం ఊపిరితిత్తులపైనే ప్రభావం చూపిస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

తెనాలిలో ఫీవర్ సర్వే

జిల్లాలో తెనాలికి చెందిన వృద్ధుడికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో తెనాలిలో ఫీవర్ సర్వే చేయిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం కరోనా సోకిన వృద్ధుడు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఏలూరుకు చెందిన మరో ఇరువురు సైతం మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

లక్షణాలు ఇవీ...

చిన్న పిల్లలు, వృద్ధులు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిన వ్యక్తులకు ప్రమాదం ఎక్కువగా కనిపిస్తోంది. తుమ్ములు, దగ్గుతో వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస సమస్యలు, ఆయాసం, ఛాతీ పట్టివేయడం వంటివి కరోనా వ్యాధి బాధితుల్లో కనిపిస్తున్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటే మేలు..

- దగ్గినా, తుమ్మినా తప్పనిసరిగా ముఖానికి చేతిరుమాలు అడ్డుపెట్టుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయకూడదు.
- చేతులను తరచుగా సబ్బుతో, శానిటైజర్‌తో మంచిగా శుభ్రం చేసుకోవాలి.
- ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలి.
- సరిపడా నీరు తాగాలి. కనీసం మూడు నుంచి ఐదు లీటర్ల వరకు నిత్యం తాగడం మంచిది.
- తగినంత నిద్రించాలి.
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి.
- వైద్యుల సలహాలు లేకుండా సొంతంగా ఔషధాలు వేసుకోవద్దు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నూతనంగా కరోనా వైరస్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఇళ్లల్లోనే ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. బయటకు వచ్చేవారు తప్పనిసరిగా మాస్క్ ధరించండి. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో, మార్కెట్, బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర ప్రదేశాల్లోకి వెళ్లకుండా దూరంగా ఉండండి. ఏదైనా అనుమానం ఉంటే గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా కరోనా పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

వారం దాటితే వైద్యులను సంప్రదించాలి



నార్మల్ ఫ్లూ మాదిరిగానే ఈ వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. వారానికి మించి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా పల్మనాలజిస్టులను సంప్రదించి, వారి సూచనల మేరకు చికిత్స తీసుకోవాలి. పదేళ్లలోపు పిల్లలు ఎక్కువ ఇబ్బంది పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆస్తమా, డయాలసిస్, షుగర్, బీపీ, కిడ్నీ, గుండె జబ్బు లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎక్కువ ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. మాస్క్‌లు ధరించడం, తగినంత నీటిని తీసుకోవడం ఉత్తమం.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

ముగిసిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 39,693 మంది విద్యార్థులు హాజరు



గుంటూరు ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్–2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 19న ప్రారంభమైన పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగాయి. ఈ నెల 19, 20వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 22 కేంద్రాల పరిధిలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 41,384 మంది విద్యార్థుల్లో 39,693 మంది హాజరయ్యారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే...

- గుంటూరు జిల్లాలోని 15 కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 25,731 మందిలో 24,607 మంది హాజరయ్యారు. ఇంజినీరింగ్ పరీక్షకు 21,590 మందికిగాను 20,765; అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు 4,141 మందికిగాను 3,842 మంది హాజరయ్యారు.
- పల్నాడు జిల్లాలోని 5 కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 11,142 మందికిగాను 10,746 మంది హాజరయ్యారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 9,214 మందికిగాను 8,944 మంది; అగ్రిల్చర్, ఫార్మసీ పరీక్షకు 1,928 మందికిగాను 1,802 మంది హాజరయ్యారు.
- బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాలలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 4,511 మందికిగాను 4,340 మంది హాజరయ్యారు. వీరిలో ఇంజినీరింగ్‌కు 3,409 మందికిగాను 3,304; అగ్రిల్చర్, ఫార్మసీ పరీక్షకు 1,102 మందికిగాను 1,036 చొప్పున హాజరయ్యారు.

జంట హత్యలపై కట్టు కథలు

- మా వెంట పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉన్నాడంటూ హంతకుల బెదిరింపు
- మేము రావడం చూసి హంతకులు పారిపోయారంటూ చెప్పిన ప్రత్యక్ష సాక్షి
- మరుసటి రోజు మాట మార్చి తప్పుడు ఫిర్యాదు
- టీడీపీలో ఆధిపత్య పోరుతోనే జెవిశెట్టి సోదరుల హత్య అంటూ ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావన
- జెవిశెట్టి వెంకటేశ్వర్లుకే ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన ఎమ్మెల్యే జూలకంటి
- తోట వెంకట్రామయ్య వర్గానికి చెందిన వ్యక్తికి రెండు కాళ్లు విరగొట్టినా పట్టించుకోని ఎమ్మెల్యే
- దీంతో హత్య చేసేందుకు సిద్ధపడిన తోట వెంకట్రామయ్య
- ఇరువర్గాల మధ్య రాజీ చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారంటూ తెలుగు తమ్ముళ్ల ఆరోపణ
- తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు పిన్నెల్లి సోదరులపై కుట్ర

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం గుండ్లపాడులో జరిగిన జంట హత్యలపై ప్రభుత్వం, పోలీసులు కట్టు కథ అల్లారు. కేసు ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అందుకు బలం చేకూరుస్తున్నాయి. టీడీపీలో ఆధిపత్య పోరుతో జరిగిన హత్యలను ఎలాగైనా వైఎస్సార్ సీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై నెట్టాలన్న దురుద్దేశంతో పెట్టిన అక్రమ కేసుగా స్పష్టమవుతోంది. హత్యలపై మృతుల అల్లుడు, టీడీపీ నేత తోట ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదులో హత్యకు గల కారణం గ్రామ తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరుతోనే జరిగిందని తన తొలి మాటల్లోనే తెలిపాడు. మృతుడు జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్యను హతమారిస్తే టీడీపీలో నాకు ఎదురు ఉండదన్న కారణంతోనే నిందితుడు తోట వెంకట్రామయ్య హత్య చేశాడని స్పష్టం చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఎలాగైనా పిన్నెల్లి సోదరులను కేసులో ఇరికించాలన్న దుర్బుద్ధితో ఓ కట్టుకథకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా హత్యలో పాల్గొన్న నిందితులు జెవిశెట్టి శ్రీను, తోట వెంకట్రామయ్య, తోట గురవయ్య, దొంగరి నాగరాజులు హత్య చేసిన అనంతరం ప్రత్యక్ష సాక్షి తోట ఆంజనేయులును చూసి కారులోని కత్తులు తీసి బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే నిజంగా కారులో కత్తులే ఉంటే బండ రాళ్లతో ఎందుకు మోది చంపుతారు, కత్తులే వాడే వారు కదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసుల ఎఫ్ఐఆర్, ప్రభుత్వ వైద్యుల పంచనామాలో ఎక్కడా కత్తులు వాడినట్టు పేర్కొనలేదు. పోతూ పోతూ "నా కొ..రా వచ్చేది మా వైఎస్సార్ ప్రభుత్వమే. మిమ్మల్ని బతకనివ్వం, మాతో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామరెడ్డిలు చెబితేనే మేము చేస్తున్నాం. మాకు ఏమైనా ఆపద వస్తే వాళ్లు చూసుకుంటారు." అంటూ కత్తులు చూపి బెదిరిస్తూ పోయారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. నిజంగా హత్యకు పిన్నెల్లి సోదరు లు కుట్ర పన్ని ఉంటే ఎవరైనా ఇలా చెబుతారా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం పిన్నెల్లి సోదరులను కేసులో అక్రమంగా చేర్చడానికి ప్రభుత్వం, పోలీసుల కుట్రగా అర్థమవుతోంది. మరోవైపు హత్య జరిగిన వెంటనే ఫిర్యాదుదారుడైన తోట ఆంజనేయులు మీడియాతో మాట్లాడిన వీడియోలో మేము రావడం చూసి పారిపోయారని చెప్పాడు తప్ప నిలబడి బెదిరించారని ఎక్కడా చెప్పలేదు. ఎమ్మెల్యే ఒత్తిడితో మరుసటి రోజు ఫిర్యాదు సమయానికి మాట మార్చాడని అర్థమవుతోంది. నిందితులు పోతూపోతూ అన్నారని చెబుతున్న కట్టుకథలు తప్ప పిన్నెల్లి సోదరుల పాత్రపై ఆధారాలు దొరకలేదు. హత్య జరిగిన ప్రదేశంలో జేబీఆర్ అని పసుపు పచ్చ రంగులో స్టిక్కర్ ఉన్న టీడీపీ నేత తోట వెంక్రటామయ్య కారు దొరికింది. ఆధిపత్య పోరు కారణంగానే హత్యలు జరిగినట్లు ఎస్పీ ప్రకటించారు. ప్రత్యక్ష సాక్షి హత్యలో పాల్గొన్న వారంతా టీడీపీ నేతలే అని స్పష్టం చేశాడు. ఇన్ని ప్రాథమిక ఆధారాలున్నా రాజకీయ కక్షతోనే పిన్నెలి సోదరులపై కేసు నమోదు చేసినట్టు అర్థమవుతోంది.



నిందితుడు తోట వెంకట్రామయ్య కారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

ఎస్పీపై ఆగ్రహం

పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావుపై పలు రకాలుగా ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు సమాచారం. ఇది టీడీపీ నేతల మధ్య జరిగిన హత్య అని ప్రాథమిక విచారణ తర్వాత ఎస్పీ తెలిపారు. దీంతో టీడీపీ అనుకూల మీడియాలో ఎస్పీపై వ్యతిరేక కథనాలు రాయించి బెదిరించే ధోరణిని ఎమ్మెల్యే జూలకంటి అవలంబించాడు. వైఎస్సార్ సీపీ నేతలపై తాను చెప్పినట్టు కేసులు నమోదు చేయకపోవడం వల్లే హత్యలు జరిగాయంటూ ఆరోపించారు. ఎస్పీపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానంటూ మీడియాలో లీక్‌లు ఇచ్చి బెదిరించి పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసు బనాయించినట్టు తెలుస్తోంది. ఇది టీడీపీ నేతల మధ్య జరిగిన హత్య అంటూ తేల్చిన పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఎవరి ఒత్తిడితో మాట మార్చారో చెప్పాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

జూలకంటి అసమర్థతే కారణం

గుండ్లపాడు టీడీపీ నాయకుల హత్యకు స్థానిక ఎమ్మెల్యే అసమర్థతే కారణమని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. కొంత కాలంగా గుండ్లపాడు పార్టీలో తారస్థాయికి చేరిన వర్గపోరును జూలకంటి పరిష్కరించి ఉంటే దశాబ్దకాలంగా పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలు హత్యకు గురయ్యేవారు కాదంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య వర్గానికి, తోట వెంకట్రామయ్య వర్గానికి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రెండు నెలలుగా అది ముదిరి దాడుల వరకు దారి తీసింది. అందులో భాగంగా గత నెల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదమే హత్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇందులో తోట వెంకట్రామయ్య వర్గానికి చెందిన ఉప్పుతోళ్ల శ్రీనుపై హత్యకు గురైన జెవిశెట్టి మొద్దయ్య వర్గీయులు దాడి చేసి రెండు కాళ్లు విరిగగొట్టారు. అయినా మొద్దయ్యను ఎమ్మెల్యే ఏమనకపోవడం, పోలీసులు ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నాడన్న బాధ తోట వెంకట్రామయ్య వర్గంలో బలంగా నాటుకుపోయింది. మరోవైపు తాను ఫోన్ చేస్తే ఎమ్మెల్యే లిఫ్ట్ చేయడం లేదని, మొద్దయ్య మాటకే విలువిస్తున్నాడని వెంకట్రామయ్య ఒకరిద్దరు టీడీపీ స్థానిక నేతల వద్ద ప్రస్తావించినట్టు తెలుస్తోంది.

యుపకులపై టీడీపీ నాయకుడి దాడి

అనుచరులతోనూ దాడి చేయించి గాయపరిచిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: యువకులపై టీడీపీ నేత దాడి చేసి, అనంతరం అనుచరులతో కూడా తీవ్రంగా కొట్టించి గాయపరిచిన సంఘటన గుంటూరు నగరంలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌కు సంబంధించి సెవెన్ హిల్స్ మెడికల్ షాపు కొత్తపేటలోని మెడికల్ కాంప్లెక్సు వద్ద ఉంది. ఈ షాపులో పనిచేస్తున్న ఓ యువకుడు కొన్ని నెలల కిందట అక్కడ మానేసి వేరే షాపులో చేరాడు. హోల్‌సేల్ మెడికల్ షాపు నుంచి అతడు సరకు తీసుకొస్తున్న సమయంలో వాటికి సంబంధించిన బిల్లులను సెవెన్‌హిల్స్ షాపునకు హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్ పంపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆ యువకుడిని షాపు వద్దకు పిలిపించారు. డేగల ప్రభాకర్‌తో పాటు కొంత మంది వ్యక్తులు ప్రశ్నించడంతోపాటు కొట్టినట్లు సమాచారం. దాడికి గురైన యువకుడు తన బంధువులు తదితరులతో కలిసి మంగళవారం ఉదయం షాపు వద్దకు వెళ్లారు. మమ్మల్నే ప్రశ్నిస్తారా అంటూ డేగల ప్రభాకర్, అతని అనుచరులు మరోమారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిసింది. టీడీపీ నేత కొత్తపేట పోలీసులకు ఫోన్ చేయగా, గాయపడిన యువకుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. యువకుడిని బెదిరించి కేసు రాజీ చేసినట్లు తెలిసింది. గాయపడిన యువకుల పేర్లు, వివరాలు తెలియరాలేదు. దీనిపై కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్యచౌదరిని వివరణ కోరగా గొడవ జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు.



యువకులపై దాడి చేస్తున్న దృశ్యం

యోగాపై ప్రజలకు అవగాహన



ర్యాలీలో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

నెహ్రూ నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలకు నెల రోజుల పాటు అవగాహన కల్పించనుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు యోగాపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు చేపట్టిన యోగాంధ్రలో గుంటూరు జిల్లా, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పర్యాటక ప్రాంతాలైన ఉండవల్లి గుహలు, మంగళగిరి ఎకో పార్క్‌లలో కూడా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు పాల్గొనేలా చేయడమే కార్యక్రమాల ఉద్దేశం అన్నారు. గుంటూరు నగపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ బుధవారం నుంచి నగరంలో వివిధ ప్రాంతాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. వైజాగ్, గుంటూరులో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన వారు యోగాంధ్ర వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీపీఓ డా.సైమన్, డీపీఎం(ఇన్‌చార్జి) డా.జయరామ్ కృష్ణ, డెమో జయప్రసాద్, డిప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి గుహల వద్ద బుధవారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరు ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ భార్గవ్ తేజ పలువురు అధికారులతో కలిసి గుహలను పరిశీలించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,400 గరిష్ఠం : రూ. 2,200

మోడల్ ధర రూ. 1,800



పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 587

కొమ్ములు : 417 బస్తాలు

కనిష్ఠ :	(ధర రూ॥ల్లో) గరిష్ఠ :	మోడల్ :
10,000	11,400	10,600

కాయలు : 170 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,400	10,850

మొత్తం అమ్మకాలు : 440.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

సాధారణాన్ని మించిన వర్షపాతం



నరసరావుపేట: జిల్లాలో మే నెల మండు వేసవిలో ఈ ఏడాది సాధారణ వర్షపాతాన్ని మించి వర్షం కురిసింది. జిల్లాలో ఈ నెల 1237.3 మిల్లీ మీటర్ల వర్షం పడాల్సివుండగా మరో నాలుగురోజులు మిగిలి ఉండగానే 2703.8 మి.మీ వర్ష పాతం నమోదైనట్లు వాతావరణ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 28 మండలాల్లో ఈనెలలో కురిసిన వర్షపాత వివరాలు ఈవిధంగా ఉన్నాయి. మాచర్లలో 102.4మి.మీటర్లు, వెల్దుర్తిలో 57.0, దుర్గిలో 78,2, రెంటచింతలలో 75,6, గురజాల 82,0, దాచేపలి 51.8, కారంపూడి89.8, పిడుగురాళ్ల 83,6, మాచవరం 46.4, బెల్లంకొండ 119.6, అచ్చంపేట 82.6, క్రోసూరు 68.0, అమరావతి 199.6, పెదకూరపాడు 105.6, సత్తెనపల్లి 146.2, రాజుపాలెం 110.4, నకరికల్లు 34.0, బొల్లాపల్లి 65.4, వినుకొండ 87.0, నూజెండ్ల 71.2, శావల్యాపురం 77.6, ఈపూరు 63.4, రొంపిచర్ల 50.2, నరసరావుపేట 135.4, ముప్పాళ్ల 118.4, నాదెండ్ల 132.6, చిలకలూరిపేట 200.4, యడ్లపాడు 169.4 మి.మీ వర్షం పడింది. ఒక్కో మండలానికి సరాసరిన 96.4 మి.మీటర్ల వర్షం కురిసింది.

ఉద్యోగోన్నతులకు ధ్రువపత్రాల పరిశీలన

గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఉపాధ్యాయులు హాజరు



ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్–3 పరిధిలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో ఆరు, ప్రకాశం జిల్లాలో ఏడు, నెల్లూరు జిల్లాలో నాలుగు హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేసేందుకు ఒక్కో పోస్టుకు ముగ్గురేసి చొప్పున స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను పిలిచారు. సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు తమ ధ్రువపత్రాలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సీనియర్ హెచ్‌ఎంలు, ఉద్యోగులు ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు సర్వీసు రిజిస్టర్, సామాజిక ధ్రువీకరణ పత్రం ఒరిజినల్, విద్యార్హతల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉపాధ్యాయ బదిలీలతో ఏర్పడే ఖాళీల్లో సంబంధిత స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు.

అర్హత లేని వారికి ప్రాధాన్యం

గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టుల్లో ఉద్యోగోన్నతులు కల్పించేందుకు రూపొందించిన సీనియార్టీ జాబితాలో అర్హత లేని వారికి ముందు వరుసలో స్థానం కల్పించినట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. మెరిట్, రోస్టర్‌ను పాటించకుండా యథేచ్ఛగా అర్హత లేని వారికి ప్రాధాన్యతను ఇచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. తద్వారా అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని, ఆర్జేడీ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

జెడ్పీ, మున్సిపల్ హెచ్‌ఎం పోస్టులకు...

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, నగరపాలక సంస్థ, మున్సిపల్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ మంగళవారం పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని జిల్లా పరీక్షా భవన్‌లో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పర్యవేక్షణలో సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్న హెచ్‌ఎం పోస్టుల్లో జెడ్పీ–59, మున్సిపల్–8, కార్పొరేషన్–9 చొప్పున ఉన్నాయి. ఆయా పోస్టుల వారీగా అర్హులైన ఉపాధ్యాయులను ఒక్కో పోస్టుకు ముగ్గురేసి చొప్పున సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. బదిలీల ప్రక్రియ అనంతరం ఖాళీల ఆధారంగా సంబంధిత స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. సీనియర్ హెచ్‌ఎంలు, ఉద్యోగులు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరించిన పోలీసులు

- నిందితులను చిత్రహింసలకు గురిచేయడం దారుణం
- కానిస్టేబుల్ చిరంజీవిపైనా ఇప్పటికే పలు అభియోగాలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ
- బాధిత కుటుంబానికి పార్టీ జిల్లా కమిటీ నేతల పరామర్శ



మాట్లాడుతున్న వై.నేతాజీ

తెనాలి: నిందితుల అరెస్టు విషయంలో తెనాలి పోలీసులు చట్టవిరుద్ధంగా, అమానుషంగా వ్యవహరించారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. వారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో నడిరోడ్డుపై లాఠీలతో జులుం ప్రదర్శించటాన్ని ఖండించారు. బాధిత కుటుంబాన్ని ఈ మేరకు మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ పరామర్శించింది. అయితానగర్‌కు చెందిన నిందితుల్లో ఒకరైన దోమ రాకేష్ నివాసానికి వెళ్లి, ఆయన తండ్రిని కలిసింది. కుటుంబ నేపథ్యాన్ని, ఘటన వివరాలను సభ్యులు తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నేతాజీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెనాలిలో పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. పోలీసుల వైఖరిని ఖండిస్తున్నామని చెప్పారు. గత నెల 24వ తేదీన రాత్రి వేళలో కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై నిందితులు దాడి చేశారని, ఆ క్రమంలో దాడికి గురైన కానిస్టేబుల్‌ను వెంటపెట్టుకొని పోలీసులు 25న నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. 27న మధ్యాహ్నం వరకు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితులను చిత్రహింసలకు గురి చేశారని బాధిత కుటుంబికులు చెప్పారని తెలిపారు. దానికి తోడు బహిరంగంగా నిందితులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడిన వీడియో వారి నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు. దళితులు, మైనారిటీలు అనే కోణంలోనే పోలీసులు దాడి చేసినట్టుగా ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. నిందితులపై విచక్షణారహితంగా దాడి చేయాలని ఏ చట్టంలోనూ చెప్పలేదన్నారు. అయినా పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని, ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థ పై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. కానిస్టేబుల్‌పై యువకులు దాడికి పాల్పడిన ఘటన వెనుకనున్న ఆంతర్యాన్ని పోలీస్ ఉన్నతాధికారులు వెలికితీయాలన్నారు. కానిస్టేబుల్ కన్నా చిరంజీవి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పలు అభియోగాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భావన్నారాయణ, తెనాలి ఏరియా కార్యదర్శి కె. బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల తీరుకు బీఎస్పీ ఖండన



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

తెనాలి: ఒక కేసులోని ముద్దాయిలను తెనాలి పోలీసులు అత్యుత్సాహంతో బహిరంగంగా హింసించటాన్ని బీఎస్పీ నాయకులు ఖండించారు. స్థానిక అయితానగర్‌లోని పొట్టి శ్రీరాములు పార్కులో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎస్పీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు, గుంటూరు జిల్లా పార్లమెంటు ఇన్‌చార్జి తెనాలి ప్రకాష్, జిల్లా నాయకులు గూడవల్లి. మణికుమారి, చిరుతనగండ్ల వాసు, తెనాలి బాధ్యుడు కారుమంచి సునీల్ సందీప్ మాట్లాడారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ

గుంటూరు వెస్ట్: జూన్ 7వ తేదీన జరగనున్న బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఆర్వో షేక్ ఖాజావలితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ గో వధ నిరోధక చట్టం 1977 నిబంధనలను పాటిస్తూ పండుగ జరుపుకోవాలన్నారు. జిల్లాలో అధికారులు అందరూ గోవధ జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవులను ఎవరూ వధించకూడదన్నారు. జంతు రవాణా నిబంధనల మేరకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రవాణా చేయకూడదన్నారు. చట్ట నిబంధనలకు లోబడి అనుమతించబడిన జంతువులను మాత్రమే జంతు వధ శాలలో వధ చేయాలని పేర్కొన్నారు. జీఎంసీ పరిధిలో టీసీపీ చట్టం నిబంధనల అమలు, పర్యవేక్షణ కొరకు నాలుగు బృందాలను, తెనాలి, పొన్నూరు ఎంటీఎంసీ పరిధిలో రెండు బృందాల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. అనధికారికంగా గోవులను తరలించడం, వధించడం వంటి సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు గానీ, తహసీల్దారులకు గానీ సమాచారం అందించాలన్నారు. గోవధకు పాల్పడేవారిని పోలీసులు ముందుగా పిలిచి బైండోవర్ చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ సుప్రజ మాట్లాడుతూ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, జంతువుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మతం పేరుతో ఏ వర్గం వారైనా సరే అసాంఘిక కార్యకలాపాలకు గానీ, అశాంతిని కలిగించేందుకు ప్రయత్నిస్తే అదుపులోకి తీసుకోవాలని తెలిపారు. సమాచారం ఉంటే పోలీసు శాఖను 86888 31307 నంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో డీపీఓ సాయికుమార్, జిల్లా ఉపరవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ సత్యనారాయణ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎస్.కె.ఎం.షరీఫ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, జెడ్‌ఎం క్యూఆర్ కోడ్ సర్వీసెస్, జాబ్ డీలర్స్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, ఎంబీఏ, పీజీ వరకు విద్యార్హతలు గల 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు పాల్గొనవచ్చని చెప్పారు. రెజ్యూమ్, సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ కాపీ, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 98668 22697 ఫోను నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

తాడికొండ: భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఆత్మకూరు లక్ష్మీ తిరుపతమ్మ (28) అనే మహిళకు తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన రామకృష్ణతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి భార్యను హింసిస్తూ అదనపు కట్నం కోసం భర్త, అతని తల్లి పార్వతి వేధిస్తున్నారు. రామకృష్ణకు మరో వివాహం చేస్తామని అతని తల్లి బెదిరిస్తుండటంతో మనస్తాపానికి చెందిన తిరుపతమ్మ ఈ నెల 21వ తేదీ అన్నంలో పురుగుల మందు కలుపుకొని తిని ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించినా భర్త పోలీసులకు సమాచారం ఇవ్వద్దని తెలిపి పరారయ్యాడు. పరిస్థితి విషమించడంతో 25వ తేదీన మధ్యాహ్నం గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా ఆమె మృతి చెందింది. తిరుపతమ్మ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేయాలి



టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు

తెనాలి టౌన్: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌ను ఎనర్జీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అందె రాజేష్ కోరారు. మంగళవారం విజయవాడ రాష్ట్ర కార్యాలయంలో సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌ను యూనియన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. యూనియన్ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు కండీషన్లు, పదోన్నతులపై చర్చించినట్లు రాజేష్ తెలిపారు. అలవెన్స్ ఆర్డర్ కాపీ ఇవ్వాలని కోరారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు సంబంధించిన ఆర్డర్‌ను కూడా త్వరలో ఇస్తామని డైరెక్టర్ చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీ, ఎగ్జిక్యూటివ్ మెంబరు బీటీ కృష్ణ తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి ముఖ్యం

జిల్లా సహకార అధికారి వెంకటరమణ



మాట్లాడుతున్న వెంకటరమణ

నరసరావుపేట: సహకార సంఘాల సమగ్రాభివృద్ధికి కమిటీ సభ్యులు, సీఈఓలు తమ వంతు పాత్ర పోషించాలని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కమిటీ సభ్యులు, కార్య నిర్వాహక కార్యదర్శులకు సామర్థ్య నిర్మాణం – సుపరిపాలనపై ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జీడీసీసీ బ్యాంకులో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో వెంకటరమణ పాల్గొని మాట్లాడుతూ సహకార సంఘాల కమిటీ సభ్యులు, సీఈఓలు సహకార సంఘాలు అభివృద్ధిలో ముఖ్యపాత్ర వహిస్తున్నారని అన్నారు. విజయవాడ సహకార శిక్షణా కేంద్ర వైస్ ప్రిన్సిపాల్ వేదాంతరెడ్డి మాట్లాడుతూ సంఘ కార్యకలాపాల పర్యవేక్షణ, సరైన పాలనకు మార్గనిర్దేశం చేయడం కమిటీ సభ్యుల ముఖ్యవిధి అన్నారు. జిల్లాలో అన్ని సహకార సంఘాలను ఈ–పీఏసీఎస్‌గా మార్చి సభ్యులకు డిజిటల్ సేవలు అందిస్తున్నామని, దీనివల్ల సంఘాల్లో పారదర్శకత పెరుగుతుందని ఆయన చెప్పారు. కంప్యూటీకరణ మూలంగా సంఘాల ఆడిట్ సులభం అవుతుందని అన్నారు. శిక్షణలో సహకార సంఘాల పర్సన్ ఇన్ చార్జీలు, సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి తరగతులు ప్రారంభం



శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడికొండ: మహిళలు, యువతకు నైపుణ్యాభివృద్ధి, సెన్సిటైజేషనుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాల ద్వారా సాధికారత సాధించవచ్చని ఏపీ సీఆర్డీఏ నైపుణ్యాభివృద్ధి అధికారులు తెలిపారు. అమరావతి ప్రాంతంలో మహిళలకు సాధికారత కల్పించడం, యువతకు నైపుణ్యాలను అందించేందుకు తుళ్ళూరులో ఈ కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. నిర్మాణ స్థలాల వద్ద కార్మికుల రాకను దృష్టిలో ఉంచుకొని జెండర్ కమిటీల సభ్యులైన 368 స్వయం సహాయక బృంద మహిళలకు లింగ ఆధారిత హింసపై సెన్సిటైజేషన్ శిక్షణ ఇస్తున్నారు. వీరు సంబంధిత ఫిర్యాదులపై పని చేస్తారని అధికారులు తెలిపారు. ఏపీ సీఆర్డీఏ స్కిల్ హబ్ తుళ్ళూరులో పెయింటింగ్ కోర్సులో 22 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు 30 మంది, ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులో 29 మందికి శిక్షణ ప్రారంభమైందన్నారు.

వైద్య విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ



స్కాలర్‌షిప్పులు పొందిన వారితో డాక్టర్ సుందరాచారి, వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో ప్రతిభ ఉన్న పేద వైద్య విద్యార్థులకు మంగళవారం స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. కళాశాల 1972 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి రూ. 15 వేల చొప్పున ఏడుగురికి స్కాలర్‌షిప్పుగా అందించడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి వాటిని అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానంలోకి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. మరొకరికి చదువుకునేందుకు సాయం చేయాలని సూచించారు. దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, జింకానా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.హనుమంతరావు, డాక్టర్ కె.ఎల్.ప్రసాద్, డాక్టర్ దక్షిణామూర్తి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నరసరావుపేటటౌన్: హత్య కేసులో నేరం రుజువు అవడంతో ముద్దాయి ఈపూరు మండలం కూచినపల్లి గ్రామానికి చెందిన నాశన పెద్ద కొండయ్యకు జీవిత ఖైదు విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్.సత్యశ్రీ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పల్నాడు జిల్లా ఈపూరు మండలం కూచినపల్లి గ్రామానికి చెందిన రాకేష్(14), తల్లిదండ్రులు వైవాహిక జీవితంలో మనస్పర్థలు వచ్చి వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రాకేష్ అదే గ్రామంలో నివసిస్తున్న నాయనమ్మ ఇంట్లో నివసిస్తున్నాడు. 2019 అక్టోబర్ 17వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రాకేష్ పెదనాన్న నాశన పెద్ద కొండయ్య అతని తల్లి లచ్చమ్మ వద్దకు వచ్చి ఆస్తి పంచాలని లేనిపక్షంలో మనవళ్లను హతమారుస్తానని హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో నిందితుడు కొండయ్య నిద్రిస్తున్న రాకేష్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలపాలైన రాకేష్‌ను అతని బంధువులు తొలుత ప్రాథమిక చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాకేష్ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ దేసిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

కర్రసాములో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కర్రసాము అంతర్జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు కాశీనాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ చూపారన్నారు. అంతర్జాతీయ కర్రసాము సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 9 బంగారు, 5 రజత, 3 కాంస్య పతకాలు సహా మొత్తం 17 పతకాలను క్రీడాకారులు సాధించారని పేర్కొన్నారు. సాయి సుబ్రహ్మణ్యం, విజయ్ శిక్షణలో క్రీడాకారులు ఈ ఘన విజయం సాధించారని తెలిపారు.

దురాచారాల నిర్మూలనలో పరిషత్‌ల కృషి భేష్



థామస్‌ను సన్మానిస్తున్న అతిథులు, కళాపరిషత్ సభ్యులు



'మా ఇంట్లో మహాభారతం' నాటికలోని ఓ సన్నివేశం

కొనసాగుతున్న జాతీయస్థాయి నాటిక పోటీలు

నాదెండ్ల: నేటి సమాజంలో సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు నాటికల ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు కళాపరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు చెప్పారు. నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటికల పోటీలు నాలుగోరోజు మంగళవారం కొనసాగాయి. సభాధ్యక్షులుగా హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వ్యవహరించారు. అతిథులుగా అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గూడే పాండురంగారావు, సినీ హీరో సందేశ్ హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా రాష్ట్రంలో వేల కళాపరిషత్ నాటికలు సమాజంలో నెలకొన్న దురాచారాలు, మూఢ నమ్మకాల నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం దర్శకుడు, రచయిత సుంకర కోటేశ్వరరావు, నాటక రూపశిల్పి కె.థామస్‌లను కళాపరిషత్ సభ్యులు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమాలను కళాపరిషత్ అధ్యక్షుడు నడింపల్లి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు...

హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి జ్యోతిరాజ్ రచనలో, వెంకట గోవాడ దర్శకత్వం వహించిన 'అమ్మచెక్కిన బొమ్మ' నాటిక ఆకట్టుకుంది. న్యూఢిల్లీ వారి అనశ్వరం నాటిక, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ వారి 'మా ఇంట్లో మహాభారతం' నాటికలు ఆకట్టుకున్నాయి.

నేటి ప్రదర్శనలు...

తాడేపల్లి అరవింద ఆర్ట్స్ 'విడాకులు కావాలి', తెనాలి అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ 'ఎవరు', కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ 'కిడ్నాప్' నాటికలు బుధవారం ప్రదర్శించనున్నారు.